## అమరవీరుల సంస్మరణసభను జయప్రదం చేయండి

-ఎమ్మార్పీఎస్ జెఏసి అధ్యక్షుడు మాసపాక యాదగిరి

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

ఈనెల 1వ తేదీని మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా మాదిగ బిడ్డలు అందరూ జరుపుకోవాలని జగదేవ్‌పూర్‌మండల మాదిగ జెఏసి అధ్యక్షుడు మాసపాక యాదగిరి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అమరవీరుల దినోత్సవం మార్చి 1న నిర్వహించాలని, మాదిగజాతి కోసం జరిగిన పోరాటంలో అసువులుబాసిన అమరుల త్యాగాలను ఎప్పటికీ మరిచిపోవద్దని అన్నారు. 30 ఏళ్లుగా ఎబిసిడి వర్గీకరణ ఉద్యమంలో క్రియాశీలకంగా పోరాటంచేసి అమరులైన ప్రతి అమరునికి జోహార్లు అర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోసాన్‌పల్లి రాజు, ఉపాధ్యక్షుడు జంగని బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి మచ్చ గణేష్, నాయకులు మల్లేశం, అభి, నర్సింలు, స్వామి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## ఎల్‌ఆర్‌ఎస్-2020లో మార్పులు

-మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

ఎల్‌ఆర్‌ఎస్-2020 పథకంలో పలు మార్పులు చేసినట్లు తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ ఎం. సంగారెడ్డి తెలిపారు. శుక్రవారం కమిషనర్ సంగారెడ్డి విడుదల చేసిన పత్రికాప్రకటన ప్రకారం... అన్ రిజిష్టర్ ప్లాట్లను రిజిస్టర్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించి రిజిష్టరు చేసుకోవచ్చున్నారు. రిజిష్టర్ ప్లాట్లకు సంబంధించి మార్చి 31వ తారీఖు లోగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25శాతం రాయితీ గుర్తించి విస్తృతమైన ప్రచారం చేయడంలో భాగంగా సిటిజన్ సర్వీస్ సెంటర్‌ను ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్‌ను మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను వేగవంతం చేయుటకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు సమాచారాన్ని అందించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకు పట్టణ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సంగారెడ్డి వివరించారు.

## సోషల్‌మీడియాలో సృష్టించే అపోహలను నమ్మవొద్దు

-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



మేళాలలో మాట్లాడుతున్న హరీష్‌రావు

**సిద్ధిపేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త ప్రతినిధి:**

పౌల్ట్రీ రైతులను కాంగ్రెస్‌సర్కారు పట్టించుకోవడం లేదని బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పౌల్ట్రీ రైతులకు మక్కలు, విద్యుత్ సబ్సిడీపై ఇచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం పౌల్ట్రీరైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత చికెన్‌అండ్ ఎగ్ మేళాలలో పాల్గొని మాట్లాడారు. చికెన్ బాగా ఉడకబెట్టి తింటే ఎలాంటి వైరస్ సోకదని సోషల్‌మీడియాలో సృష్టించే అపోహలను నమ్మవద్దన్నారు. గతంలో అపోహలు వస్తే కెసిఆర్‌తో పాటు ప్రజాప్రతినిధులు అంతా చికెన్‌తిని అపోహలను దూరంచేసి ప్రజల్లో నమ్మకం కల్పించామని తెలిపారు. అతితక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రోటీన్ ఇచ్చేది చికెన్, కోడిగుడ్డు మాత్రమేనని తెలిపారు. 70డిగ్రీల వరకు ఉడకపెడితే ఎలాంటివైరస్ ఉండదని ప్రపంచ ఆరోగ్యసంస్థ తెలిపిందని గుర్తుచేశారు. కొంతమంది సృష్టించిన అపోహలతో మాంసంధరలు కొండెక్కినాయన్నారు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద పౌల్ట్రీ సిద్ధిపేట జిల్లాలోనే ఉందన్నారు. చికెన్‌తింటే ఎలాంటి హానీ ఉండదన్నారు. కార్యక్రమంలో పౌల్ట్రీరైతులు, బిఆర్ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలి

-జిల్లా కలెక్టర్ మను చౌదరి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో పదోతరగతి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం పదోతరగతి పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21నుంచి ఏప్రిల్ 4వతేదీ వరకు పదోతగరతి పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 79 పరీక్షాకేంద్రాలలో 14138 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 14124 ప్రైవేటు 14మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లును ఏర్పాటుచేసి కఠినమైన నిఘా పెట్టాలన్నారు. స్ట్రాంగ్‌రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటుచేసి ఇందుకోసం కస్టోడియన్, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించాలన్నారు. పరీక్షాకేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాలవద్ద 144సెక్షన్ అమలుచేయాలన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపుకలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హామీద్, ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, అడిషలన్ డిసిపి సుభాష్‌చంద్ర బోస్, డిఈవో శ్రీనివాస్‌రెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూగర్భజలాలను పొదుపుగా వాడుకోవాలి




గవ్వలపల్లిలో మాట్లాడుతున్న భూగర్భజలశాఖ జిల్లా అధికారి సతీష్‌యాదవ్

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

మండలపరిధి గవ్వపల్లిలో నీటినాణ్యతపై జిల్లా భూగర్భజలాల జిల్లా అధికారి సతీష్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంచుట్టూ ఉన్న ఏడు బోరుబావుల నుండి నీటినితెప్పించి వాటి నాణ్యతను పరికరాల ద్వారా పరీక్షించి నీటి నాణ్యతను చూపించారు. త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా భూగర్భజలశాఖ అధికారులు లావణ్య, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, యాదవరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు తమ సామర్థ్యాలను పరీక్షించుకోవాలి

-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూటర్‌ల్యాబ్‌ను ఉపయోగించే విద్యార్థులుస్వతహాగా తమ సామర్థ్యాలనుపరీక్షించుకోవాలని మెదక్‌జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూటర్‌ల్యాబ్‌ను ఉపయోగించే పిల్లల సామర్థ్యాలను అసెస్మెంట్ చేయుటకు నర్సాపూర్ పట్టణంలోని మండలపరిషత్ ప్రాథమికపాఠశాల నెంబర్2 పాఠశాలను జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ సందర్శించారు. ఈపాఠశాలలో కంప్యూటర్‌చే నిర్వహించబడుతున్న ఎఫ్ఎల్ఎన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యాకార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలుసూచనలు సలహాలను ఇచ్చారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమంలో కంప్యూటర్‌విద్యను నేర్చుకోవాలని సూచించారు. మూడవతరగతి తెలుగుక్లాసును బోధిస్తున్న ఉపాధ్యాయుడు రవి తరగతిని సందర్శించి విద్యార్థులసామర్థ్యాలను పరీక్షించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి తారా సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మక్సుద్‌అలీ, ఉపాధ్యాయులు గణేష్,సరిత,రవి,కిష్టయ్య, బుస్రాపా, ఇంతియాజ్,అఫ్సాన, సిఆర్‌పిలు నరసింహచారి, భైరవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలకు కంప్యూటర్‌విద్య ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

# ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

-పరీక్షలు జరిగే ప్రదేశాలలో 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు
-పరీక్షలకు 30సెంటర్లలో మొత్తం 6238మంది విద్యార్థులు
-మార్చి 5నుంచి 23వరకు పరీక్షలు
-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్‌లు పరీక్షాకేంద్రాలకు అనుమతించరాదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, తప్పులుదొర్లకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షలుజరిగే సమయంలో 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్షా కేంద్రాలవద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్షాకేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు త్రాగునీరు, మూత్రశాలల సౌకర్యం వంటి అన్ని మౌలికసదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో పరీక్ష పేపర్లను తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎగ్జామ్ ప్యాడ్,పెన్,పెన్సిల్,రబ్బర్, హాల్ టికెట్లను మాత్రమే పరీక్షాకేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ప్రతి సెంటర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్ళతో బందోబస్తు నిర్వహించాలన్నారు. పరీక్షాకేంద్రాలకు కాంపౌండ్‌వాల్ లేనివాటికి బారికేడ్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్‌సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరీక్షాకేంద్రంలో ప్రాథమికచికిత్స కిట్‌లు అందుబాటులో ఉండాలని, ఆశావర్కర్‌లను నియమించాలన్నారు. పరీక్షరాసే విద్యార్థుల గదుల్లో ఎలాంటి మెటీరియల్ లేకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ నిర్వహించాలని తెలిపారు. అలాగే ఎక్కడా కూడా మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమయానికి పరీక్షాకేంద్రాలకు చేరుకునేవిధంగా బస్సులసౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సిసికెమెరాల పనితీరును సరిచూసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఎంపిని కలిసిన మండల జెఏసి నాయకులు

-సానుకూలంగా స్పందించిన ఎంపి రఘునందన్‌రావు



ఎంపి రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న మండల జెఏసి నాయకులు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ గ్రామ శివారులో ఏర్పాటుచేస్తున్న డంపింగ్ యార్డ్ వల్ల గుమ్మడిదల, నర్సాపూర్, శివ్వంపేట మండలాల నివాసితప్రాంత ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకం కాబోతుందని శుక్రవారం గుమ్మడిదల మండల అఖిలపక్ష నాయకులు, జెఏసినాయకుల ఆధ్వర్యంలో మెదక్ ఎంపి రఘునందన్‌రావును ఆయన నివాసంలో కలిసి ఇక్కడిప్రాంత సమస్యను స్పష్టంగా తెలపడం జరిగిందని వారు వివరించారు. అందుకు ఆయన స్పందిస్తూ జెఏసి నిర్ణయంపై, అక్కడిప్రజల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సందర్భంగా జెఏసి అధ్యక్షులు చిమ్ముల జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు 35కిలోమీటర్‌ల దూరంలో నర్సాపూర్ అటవీప్రాంతంలో దాదాపు 30చదరపు కిలోమీటర్లు, దాదాపు 7,413 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉందని, ఎన్నో వందల సంవత్సరాల నుంచి తాతముత్తాతల నుంచి కాపాడుకుంటూ వస్తున్న దట్టమైన అడవులు, అడవిపై ఆధారపడ్డ వన్య ప్రాణులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, 3మండలాలోని 74గ్రామాలు, దాదాపు 3లక్షల ప్రజలజీవితాలు, లక్షల ఎకరాల వ్యవసాయ ఆధారితభూమి, వ్యవసాయపై ఆధారపడ్డ కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యే ప్రమాదం ఉందని, ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే అక్కడ ఉత్పత్తి వల్ల విడుదలయ్యే వ్యర్థజలాలు పక్కన ఉన్న వాగులోకలిసి అక్కడి నుండి నర్సాపూర్ మున్సిపాలిటీకి జీవనాధారమైన రాయారావుచెరువు భూగర్భజలాలు కలుషితమై, గొలుసుకట్టు చెరువులైన పక్కగ్రామాల్లోని దాదాపు 20గ్రామాల చెరువులు కలుషితం అవుతాయని, ముఖ్యంగా ఈప్రాంతంలో కొన్ని వందల ఎకరాల్లో రైతులు వ్యవసాయం చేస్తూ హైదరాబాద్‌కు ప్రతి రోజు వేలటన్నుల కూరగాయలు, వేలలీటర్లలో పాలను అందిస్తున్నారని, డంపింగ్ యార్డు కొనసాగితే హైదరాబాద్ వాసుల జీవనం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని, కొన్ని వందల ఏళ్ళ చరిత్ర గల పచ్చని ఈపర్యావరణాన్ని మెదక్ ఎంపిగా మీరు నాయకత్వం వహిస్తున్న ప్రాంతంలో ఇది ఒకపెద్ద సమస్యగా మారకుండా మరో జవహర్‌నగర్ కాకుండా చూడాలని, ప్రస్తుతం ఏర్పాటు చేయబోతున్న డంపింగ్ యార్డ్‌ను తక్షణమే నిలిపివేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరడం జరిగిందని వారు తెలిపారు. అందుకు ఎంపి రఘునందన్ రావు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మండల అఖిలపక్ష నాయకులు, డంపింగ్ యార్డ్ వ్యతిరేక సమితి, సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లుచేయాలి

-జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు




సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

ఇంటర్,పదవతరగతి పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఇంటర్,పదవతరగతి పరీక్షల నిర్వహణపై సంబంధితశాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ఇంటర్,పదోతరగతిపరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇంటర్‌పరీక్షలు 54 పరీక్షాకేంద్రాల్లో, పదోతరగతిపరీక్షలు 122 పరీక్షాకేంద్రాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పదవతరగతి పరీక్షలకు జిల్లాలో 22423మంది విద్యార్థులు హాజరుతున్నారని తెలిపారు. ఇంటర్ మొదటిసంవత్సరం జనరల్‌విభాగంలో పరీక్షలకు 15వేల984మంది విద్యార్థులు, ఒకేషనల్‌పరీక్షలకు1681, మొత్తం17665మంది విద్యార్థులు, మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్నట్లు, ద్వితీయసంవత్సరం పరీక్షకు జనరల్‌విభాగంలో17,057, ఒకేషనల్ పరీక్షలకు1431,మొత్తం18488 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

మార్చ్ 5వ తేదీ నుండి మార్చ్ 25వరకు ఇంటర్‌పరీక్షలు, మార్చి 21నుండి ఏప్రిల్ 4వతేదీవరకు పదవతరగతిపరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్సులునడిపించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్‌సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌నుండి పరీక్షాకేంద్రాలకు ప్రశ్నాపత్రాల తరలింపు పరీక్ష నిర్వహణ తర్వాత పరీక్షాకేంద్రాలనుండి పోస్ట్ ఆఫీస్‌లకు జవాబుపత్రాల తరలింపుపై అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని పోలీసుబందోబస్తు నడుమ ప్రశ్నాపత్రాలు, జవాబుపత్రాల తరలింపు జరగాలని అధికారులకు సూచించారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

-జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్

**హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

వసతిగృహాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థుల సైన్స్‌ఫెయిర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా పరిశీలించి వారిని అభినందించారు. అనంతరం వారి వసతిగృహాన్ని సందర్శించి వారికి ఏరకమైన భోజనం అందిస్తున్నారని, మెనూప్రకారం భోజనం అందుతుందా లేదా అని ఆరా తీశారు. వంటగదినిసందర్శించి వంటసామగ్రి, భోజనాల నాణ్యతలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల విశ్రాంతి గృహాన్ని పరిశీలించి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగినచర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం హుస్నాబాద్ ఎల్లమ్మచెరువు సుందరీకరణ పనులను స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ తదితరులతో కలిసి పరిశీలించారు.



భోజనాల నాణ్యతను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్

## చెత్త సేకరణలో చిత్తశుద్ధిలేదా...!

కొరవడిన జిల్లా అధికారుల పర్యవేక్షణ
అధికారులు, సిబ్బందిపై
అసహనం వ్యక్తంచేస్తున్న పట్టణ ప్రజలు

**చేర్యాల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది పారిశుధ్య కార్మికుల తీరుపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చేర్యాల మున్సిపాలిటీలో 12వార్డులున్నాయి. అయితే శుక్రవారం మధ్యాహ్నం (గాంధీసెంటర్-కడవేర్గురోడ్డు) మెయిన్‌బజార్ 7వవార్డులో విధుల్లో భాగంగా చెత్త సేకరణకు వాహనంతో ఇద్దరు పారిశుధ్య కార్మికులు వచ్చారు. ఈక్రమంలో ఎప్పటిలాగే చెత్తసేకరణ వాహనంరాగానే చెత్త వేయడానికి అక్కడి మహిళలు వెళ్లారు. దీంతో సిబ్బంది అడ్డుకుని, ఇది మీ వార్డు కాదు మీది 8వవార్డు మీవార్డు సిబ్బంది వారి వ్యక్తిగత పనులు చేసుకుంటున్నారు. చెత్త మీ ఇంటిముందు పోసుకుని ఫోటో దింపి అధికారులకు పెట్టండి అని, చెత్తను వాహనంలో వేసుకోకుండా సిబ్బంది వెళ్ళిపోయారని మహిళలు ఆరోపించారు. అధికారుల పట్టింపులేకనే సిబ్బంది ఇలా వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.

**చెత్త సేకరణకు 3-4రోజుల కొకసారి వెళ్ళండి...**

పల్లెలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలని చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయద్దని ప్రభుత్వం పంచాయతీ, మున్సిపాలిటీల్లో చెత్తసేకరణకు వాహనాలను అందించింది. అంతే కాకుండా రోజువారీగా సేకరించిన చెత్తను డంపు చేసేందుకు డంపింగ్ యార్డులను కూడా ఏర్పాటుచేసిన విషయం విదితమే. అయితే చేర్యాల మున్సిపాలిటీ అధికారుల తీరు అందుకు విరుద్ధంగా ఉందని పలువురు చెప్పుకుంటున్నారు. రోజువారీగా చెత్త సేకరణకు వెళ్లే వాహనాలకు డీజిల్ ఖర్చు అధికంగా అవుతుందని, ఈమేరకు 3-4రోజులకొకసారి వెళ్ళాలని కార్మికులకు ఓ అధికారి తెలిపినట్లు పట్టణంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రతిరోజూ చెత్తను సిబ్బంది తీసుకెళ్ళకపోవడంతో పట్టణప్రజలు మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై మండిపడుతున్నారు.ఇప్పటికెనా జిల్లా అధికారులు పట్టించుకుని చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




చేర్యాల మున్సిపల్ కార్యాలయం

## టెన్త్‌లో ఉత్తమఫలితాలు సాధించాలి

-జిల్లా అదనపుకలెక్టర్ నగేష్

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

టెన్త్‌పరీక్షలలో ఉత్తమఫలితాలు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికలపాఠశాలను తనిఖీచేశారు. ఈసందర్భంగా వసతిగృహంలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో ఏమైనా సమస్యలున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూప్రకారం,నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. ఇందుకు అవసరమైనసూచనలు, కార్యాచరణ ప్రణాళికలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ మన్నన్, పాఠశాల ప్రిన్సిపల్ గీత, పాఠశాల సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అదనపుకలెక్టర్ నగేష్

## యథేచ్ఛగా మట్టి దందా

-రోజుల తరబడి దోచుకెళ్తున్న మట్టి
-జెసిబి, టిప్పర్లను సీజ్ చేసిన పోలీసులు, రెవెన్యూ అధికారులు



జెసిబి, టిప్పర్లను సీజ్ చేస్తున్న పోలీసులు

**సిద్ధిపేట అర్బన్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

మండలంలో మట్టిదందా యథేచ్ఛగా నడుస్తోంది. రోజుల తరబడి మట్టిని అక్రమంగా వ్యాపారులు దోచుకెళ్తుండగా ఆయా గ్రామాలకు చెందిన ప్రజల ఫిర్యాదు మేరకు శుక్రవారం రెవెన్యూ అధికారులు, త్రీటౌన్ పోలీసులు జెసిబితోపాటు మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్‌చేశారు. త్రీటౌన్ పోలీసులు, రెవెన్యూ అధికారులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బక్రిచెప్యాల, వెల్కటూర్ గ్రామాల మధ్యలో వ్యవసాయ పొలాల మధ్యలోంచి గత మూడురోజులుగా ఇష్టారీతిన మట్టిని టిప్పర్లలో తరలిస్తుండడంతో దుమ్ముతో ఇబ్బందిపడిన గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో మట్టిని తరలిస్తున్న ప్రాంతానికి వెళ్లి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టాభూమి అయినా సరే ఎవరైనా మట్టిని తరలించాలంటే మైనింగ్, రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు.

## పాముకాటుకు బాలుడు మృతి

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

పాముకాటుకు గురై బాలుడు మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని కొత్తపల్లిగ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనంప్రకారం.. గ్రామానికిచెందిన కురుమ విఠల్ కుమారుడు కుర్మ హనుమంత్(15) గురువారం తమ వ్యవసాయక్షేత్రానికి కాలినడకన వెళుతున్న క్రమంలో నాగుపాముపై కాలేయడంతో పాము కాటువేసింది. గ్రామంలో నాటువైద్యులు రెండుగంటలపాటు నాటువైద్యంచేసినా ప్రయోజనం లేకపోవడంతో నారాయణఖేడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో హనుమంత్ చికిత్స అందుకుంటూ కానరాని లోకాలకు చేరిపోయాడన్నారు.

## జాతరకు వచ్చిన భక్తుడు అదృశ్యం

**కొల్చారం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

సంగారెడ్డిజిల్లా జహీరాబాద్ బాగారెడ్డిపల్లిగ్రామానికి చెందిన పేర్ల పెంటయ్య (42) మహాశివరాత్రి నాడు ఏడుపాయలజాతరకు వచ్చాడని, తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులవద్ద, స్నేహితులవద్ద వెతకగా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం భార్య లక్ష్మీ, తమ్ముడు తుల్జారాంలు కొల్చారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

## కమలాయపల్లి ఓటి నిర్మాణం విరమించుకోవాలి


సమస్యను విన్నవిస్తున్న రైతులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి**: దూళ్‌మిట్ట మండల పరిధిలోని కమలాయపల్లి వద్ద ఓటి నిర్మాణం చేపడితే తీవ్ర ఆందోళన చేస్తామని నంగునూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు హెచ్చరించారు. కమలాయపల్లి ఓటి నిర్మాణం విరమించుకోవాలని కోరుతు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో నంగునూర్ మండల పరిధిలోని 10 గ్రామాలకు చెందిన రైతులు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఓటి నిర్మాణంతో మండల పరిధిలోని 10 గ్రామాలకు రైతులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కమలాయపల్లి ముందు నుంచి పైప్ లైన్ ఓటి నిర్మాణం నిర్మాణం చేపట్టి డి3 కాలువకు అనుసంధానం చేయడం వలన రంగనాయకసాగర్ కుడి కాలువ ద్వారా కమలాయపల్లి అర్జున్‌పట్ల,జాలపల్లి, దూళ్‌మిట్ట గ్రామాలకు నీరు అందుతుందన్నారు. ఇప్పటికే ఆ గ్రామాలకు తపాస్‌పల్లి ద్వారా ఆయకట్టు స్థిరకరణ జరిగిందన్నారు. ఓటి నిర్మాణం చేపట్టడం వలన నంగునూర్ మండల పరిధిలోని మైసంపల్లి, అంక్షాపూర్, ఖానాపూర్, నాగరాజుపల్లి నంగునూర్,అక్కన్నపల్లి, ఘనపూర్, కొండంరాజ్‌పల్లి, గట్లమల్యాల, ఖాతా గ్రామాల రైతులకు నష్టం జరుగుతుందని ఓటి నిర్మాణం విరమించుకోవాలని లేనియెడల ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు లింగంగౌడ్, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, పురేందర్, కిష్టారెడ్డి, నాగేందర్,అజ్జు. శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### దేవాలయ పవిత్రతను భగ్నం చేస్తున్న పాలకమండలి సభ్యులు

**కొమురవెల్లి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** :మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో తోట బావి వద్ద మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పెద్దపట్నం వేసే దగ్గర ఆలమ ధర్మకర్త జయప్రకాశ్‌రెడ్డి చేతిలో కర్ర పట్టుకొని పాదరక్షలు వేసుకొని పెద్ద పట్నం వేసే దగ్గర అటు ఇటు తిరుగుతూ భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించారని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరి రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయ పవిత్రతను భగ్నం చేసిన దేవాలయ ధర్మకర్తను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు అత్తిని శారద, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, నీల భిక్షపతి, కర్రల్లో ఎల్లయ్య, కానుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల సాధనకు ఏఐటియూసి రాజీలేని పోరాటం

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** :భవన నిర్మాణ కార్మికుల సమస్యల సాధనకు ఏఐటియూసి రాజీలేని పోరాటాలు చేస్తుందని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అందె అశోక్‌లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రామిక్ భవన్‌లోశుక్రవారం తెలంగాణ బిల్డింగ్అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల కరపత్రాన్నిఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు థంబ్ సిస్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలన్నారు. సహజ మరణంకు రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలన్నారు. 55 యేండ్లు నిండిన కార్మికులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు.హెల్త్ కార్డులతో పాటు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పాత లేబర్ కార్డులను రెన్యూవల్ చేయాలని రేషన్ కార్డున్ ఫ్యామిలీ మెంబర్ కార్డుగా గుర్తించాలన్నారు. కార్మికులకు నామినికి బెనిఫిట్స్ అందించాలన్నారు. ఏప్రిల్ 21,22వ తేదీలలో శంషాబాద్ రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బెక్కంటి సంపత్, నాయకులు గజ్జల సురేందర్, మ్యాక యాదయ్య, రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** :జిల్లా కేంద్రంలోని విద్యానికేతన్ హైస్కూల్ శుక్రవారం ఘనంగా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనగా కౌన్సిలర్లు తస్లీమ్ బేగమ్, అబ్దుల్ మోయిజ్, పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్‌లు ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలించారు. రకాల వంటలు, స్వీట్స్ స్వయంగా తయారు చేసి వాటిని ప్రదర్శించి విక్రయించారు. ఆహార పదార్థాలను స్వయంగా తయారు చేసుకోవడం ద్వారా పోషక విలువలను నాణ్యతను కోల్పోకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబీకులను పరామర్శించిన

### మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు


అంక్షాపూర్‌లో బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న హరీష్‌రావు

**నంగునూర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**మండలపరిధిలోని అంక్షాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త పిల్లి జనార్ధన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అలాగే నంగునూర్ మండలకేంద్రంలో మాజీ ఉపసర్పంచ్ మహేందర్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అలాగే మండలకేంద్రానికి చెందిన మాజీ వార్డుసభ్యులు కోల నర్సింహులు భార్య రోడ్డుప్రమాదంలో మృతిచెందగా అమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి బాధిత కుటుంబీకులను ఓదార్చారు. చిన్నకోడూరు మండలపరిధిలోని కస్తూరిపల్లిగ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ వంద ఓట్ల ఇంచార్జి శ్రీనివాస్ ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టు మీదనుంచి కిందపడి రెండు కాళ్లు విరిగి సిద్ధిపేట పట్టణంలోని మురళికృష్ణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుని పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్‌కు మెరుగైన వైద్య అందించాలని డాక్టర్‌ను కోరారు. ఆధైర్యపడొద్దు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయనవెంట పార్టీ నాయకులు రాధాకృష్ణశర్మ, జాప శ్రీకాంత్‌రెడ్డి, లింగంగౌడ్, సారయ్య, సోమిరెడ్డి, రమేష్‌గౌడ్, పురేందర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

**హుస్నాబాద్‌టౌన్,ఫిబ్రవరి28,ప్రభాతవార్త** : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ విజయగిరి బిక్షపతి అన్నారు.శుక్రవారం రోజున పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి నిద్ర చేసింది మొదలుకుని పడుకునే వరకు చిన్న చిన్న మిషన్ల నుండి స్పేస్ రిసెర్చ్ వరకు ఎన్నో అంతుచిక్కని రహస్యాలను చేదించిన సైన్స్ అని భారత భౌతిక శాస్త్రవేత్త అయిన చంద్రశేఖర్ వెంకటరామణ్ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్న సందర్భంగా సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డుతో సత్కరించిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తగా కెరాజ్యలక్ష్మి వ్యవహరించగా కుమారస్వామి,బాలరాజు,చంద్రమౌళి,ఇందిరానైనా దేవి,సబీ ఫాతిమా, సుధా, మాధురి, విజయ,అనిత, పరశురాం, శ్రీనివాస్,రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

### పోతారం పాఠశాలలో సైన్స్ సంబరాలు

**హుస్నాబాద్‌రూరల్,ఫిబ్రవరి28,ప్రభాతవార్త:** మండలంలోని పోతారం (ఎస్) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోజున సైన్స్‌దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ ముగ్గులు,ఉపన్యాసాలు,వ్యాసరచన పోటీలు నిర్వహించడంతో పాటు విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను అక్కడ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి బండారి మనీల బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,అధ్యాపకులు ఆత్మలింగం,నేతాజీ,దుమ్యా,రఫీ,విమలా దేవి,నరేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

### కండరాల క్షీణత బాధితులకు నిత్యావసరాలు అందజేత

**పటాన్ చెరు,ఫిబ్రవరి 28,ప్రభాతవార్త:** పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నందిగామ రోడ్డు రామాలయం ఆవరణలో కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో సమకూర్చిన బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు రూ.3500 విలువ చేసే వాటిని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 20 మంది కండర క్షీణత తీవ్ర వైకల్య బాధితులకు టిఎండిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టిఎండిఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్ మాట్లాడుతూ.. గురు రాఘవేందర్ ద్వారా తెలుసుకొని పెద్ద మనసుతో స్పందించి సహాయం చేసిన వెంకట కృష్ణారెడ్డి, విజయ నిర్మల దంపతులకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు మురళీ, మోహన్, శేఖర్, మూర్తి, గురు రాఘవేందర్, సామాజిక కార్యకర్త బాపు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

### చదువుతో పాటు పరిశోధనలపై దృష్టి సారించాలి

**చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 28,ప్రభాతవార్త:** చదువుతో పాటు పరిశోధనలపై విద్యార్థులు దృష్టి పెట్టాలని మండల విద్యాధికారి పుష్పవేణి అన్నారు. శుక్రవారం మండల పరిధి మిర్జాపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల నమూనాలను ఆమె పరిశీలించారు. మూఢనమ్మకాలపై విద్యార్థులు చేసిన నాటకం ఆలోచింపచేసేలా ఉందని వారి అభినందించారు. క్విజ్,వ్యక్తిత్వ, వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### మార్చి 3 నుంచి హనుమాన్ దీక్షలు ఆరంభం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** మండలంలోని కొండాపూర్‌లో మార్చి మాసం 3వ తారీఖు నుంచి హనుమాన్ దీక్షలు ప్రారంభించనున్నట్లు కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీ సంగ్రామ్ మహారాజ్ తెలిపారు. హనుమాన్ దీక్షలు తీసుకునే భక్తులు పసుపు రంగు దోవతి, కాషాయం రండు షర్ట్‌ను ధరించి 41 రోజులు నిష్టనియమాలతో దీక్షలు చేయాల్సి ఉంటుందన్నారు. హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో శ్రీ రామ జయ రామ జయ జయ రామ హోమం చేసి దీక్షలను విరమించాల్సి ఉంటుందన్నారు.మండల దీక్షలు చేపట్టాల్సిన భక్తులు మార్చి 3న ఉదయం 6 గంటలకు ఆశ్రమానికి చేరుకుని దీక్షలు తీసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 934697537ను సంప్రదించాలని సంగ్రామ్ మహారాజ్ సూచించారు. తమ జీవితంలో ఒకమారైనా హనుమాన్ దీక్షను స్వీకరించాలని సంగ్రామ్ మహారాజ్ వివరించారు.

### ఆర్‌డిఓ కార్యాలయం ముందు నిరసన

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** భారత మార్క్సిట్ కమ్యూనిటీ పార్టీ ఐక్య ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయాలని నారాయణఖేడ్‌లోని ఆర్‌డిఓ కార్యాలయం ముందు ఎం సిపిఐ యు పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్నికల్లో చేసిన హామీలైన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో విద్య, వైద్య, మహిళా, యువజన సంక్షేమ రంగాలకు 40 శాతం నిధులు కేటాయించాలన్నారు. రెవిన్యూ అధికారులతో చేతులు కలిపి అక్రమంగా చేసుకున్న పట్టాలను రద్దు చేసి ప్రజలకు పంపిణీ చేయాలని సూచించారు. పేద ప్రజలకు ఇండ్ల పట్టాలు ఇందిరమ్మ గృహాల్లో నిర్మాణ పథకం మంజూరు చేయాలని నాయకులు బాలరాజ్, అరుణ్ సిమోన్, బీతయ్యలు డిమాండ్ చేశారు.

### ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించిన జడ్పీ సీఈఓ

**చౌటకూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులోని మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జడ్పీ సీఈఓ జానకిరెడ్డి సందర్శించారు. కార్యాలయంలో సరైన సౌకర్యాలు ఉన్నాయా లేవా అని ఎంపిడిఓకు సీఈఓ అడిగి తెలుసుకున్నారు. ఫర్నిచర్ సమకూర్చాలని ఎంపిడిఓ సీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. కార్యాలయానికి చేరుకున్న జడ్పీ సీఈఓ జానకిరెడ్డికి ఎంపిడిఓ శంకర్ ఉష్పగుచ్చం అందించి ఘనంగా స్వాగతం పలికారు. తాడ్దాన్‌పల్లిలో గోతులు ఏర్పడటంతో మురికి నీరు చేరుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల దృష్ట్యా ఈసీఓ గ్రామాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుద్యం, మురుగునీరు పారుదల తదతర అంశాలపై పంచాయితీ కార్యదర్శి సిద్దమ్మను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఆర్ ఏఈ శశికుమర్, పంచాయితీ కార్యదర్శి సందీప్‌గౌడ్, కారోబార్ జాఫర్, జూనియర్ సహాయకులు ప్రీతం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మంజీరా విద్యాలయంలో ఘనంగా సైన్స్ డే


విద్యార్థులు తయారుచేసిన పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

**రామాయంపేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** ఃరామాయంపేట పట్టణంలోని మంజీరా విద్యాలయంలో శుక్రవారం నాడు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక మండల విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడారు. కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, వాసవి మాట్లాడుతూ మంజీరా పాఠశాలలో ప్రతి సంవత్సరము జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల యొక్క ఆలోచనలు రేకెత్తించడం కోసం వారిలో ఎంతో మంది బాల శాస్త్రవేత్తలు ఉన్నారని, వారే రేపటి తరాలలో ఎన్నో ఆవిష్కరణలు చేసి గొప్పగా అవుతారని ఆశిస్తున్నామన్నారు. తక్కువ ఖర్చు,విద్యుత్ ఆదా చేస్తూ సైకిల్‌తో వాషింగ్ మిషన్ మధ్యతరగతి వారికి ఉపయోగపడేటటువంటి విధంగా తయారు చేయడం జరిగింది. ఇది అందర్నీ ఆకట్టుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, వాసవి, ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, సుధాకర్, శ్రీశైలం, సాగరిక, రమ్య, శ్రీనీత, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దు

**రామాయంపేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** ఃసంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చునని, విద్యార్థులు చదువుతో పాటుగా సంస్కారం అలవర్చుకోవాలని రామాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట రాజా గౌడ్ తెలిపారు. శుక్రవారం నాడు రామాయంపేట పట్టణంలోని కళ్యాణి శుభ వేదిక ఫంక్షన్ హాల్‌లో స్నేహ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించడం జరిగింది. దీనికి ముందుగా సమావేశంలో అతిథులు జ్యోతి ప్రజ్వలన గావించారు. సమావేశానికి స్నేహ విద్యా సంస్థల చైర్మెన్ లయన్ వలిశెట్టి సత్యనారాయణ సభాధ్యక్షత వహించారు. అనంతరం సిఐ వెంకట రాజా గౌడ్ మాట్లాడుతూ రామాయంపేట పట్టణంలో ఉన్న స్నేహ విద్యాసంస్థల్లో చదువుకున్న విద్యార్థులు ప్రస్తుతంమంచి పదవుల్లో ఉన్నారని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన స్నేహ విద్యాసంస్థల చైర్మెన్ మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాయాంలో ప్రైవేటు కళాశాలలు బాగా పనిచేశాయని తెలిపారు. కార్యక్రమంలో మెరిట్ విద్యార్థులకు యాజమాన్యం అవార్డులను అందజేసింది. ఈకార్యక్రమంలో ట్రాన్స్‌కో రిటైర్డ్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామ్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు రాములు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకుడు చొల్లేటి దయాకర్‌రావు, యూడిసి రాములు, తాసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రోజాతో పలువురు పాల్గొన్నారు.

### చెడు మార్గాల్లో పయనిస్తే భవిష్యత్తు అంధకారం...

**రామాయంపేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** ఃవిద్యార్థిని, విద్యార్థులు సక్రమమైన మార్గంలో పయనిస్తే మంచి ఫలితాలు వస్తాయని, అదే చెడు మార్గంలో ముందుకు వెళ్తే వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని రామాయంపేట మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ గుప్తా తెలిపారు. శుక్రవారం నాడు పట్టణంలోని వివేకానంద విద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం పాఠశాలకు చేరుకున్న ఎంఈఓ శ్రీనివాస్ గుప్తా సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఆయనకు ప్రిన్సిపాల్, విద్యార్థులు స్వాగతం పలికారు. పాఠశాలలో 173 ప్రాజెక్టులను ప్రదర్శించారు. స్థానిక అటవీ శాఖ రేంజర్ విద్యాసాగర్ పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను సందర్శించి విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించారు. మల్టీక్రాపింగ్, రివర్ క్లీనింగ్, స్మార్ట్ పోల్ సిస్టం, విండ్ ఎనర్జీ వంటి తదితర ప్రాజెక్టులు తల్లిదండ్రులను మ వీక్షకులను ఆకట్టుకున్నాయి.

### సంఘం బెడ-2 నూతన కార్యవర్గం ఎన్నిక

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** ఃరామాయంపేట పట్టణ సగర సంఘం బెడ – 2 నూతన కార్యవర్గాన్ని శుక్రవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సగర సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్కు దత్తాద్రి సగర, జిల్లా సగర సంఘం ముఖ్య సలహాదారుడు దోమకొండ యాదగిరి సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేష్ సగరల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షులుగా మర్కు అజేష్ సగర, ఉపాధ్యక్షులుగా మాసాయిపేట చంద్రం సగర, ప్రధాన కార్యదర్శిగా మర్కు శ్రీకాంత్ సగర, సహాయ కార్యదర్శిగా దోమకొండ కిశోర్ సగర, కోశాధికారిగా రేవెల్లి వినయ్ సగరలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దోమకొండ పెద్ద సిద్దరాములు సగర, రేవెల్లి సురేష్ సగర, మర్కు కిష్టయ్య సగర, రేవెల్లి దీపక్ సగర, మర్కు యాదగిరి సగర, దోమకొండ సత్యనారాయణ సగరతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### పన్యాలలో రైతులకు అవగాహన కార్యక్రమం

**హత్నూర ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** :హత్నూర మండలం పన్యాల గ్రామంలో ఏరువాక కేంద్రం సంగుపేట్ సమన్వయకర్త శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో విద్యార్థులు పన్యాల గ్రామంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులు మరియు సమస్యలు పటాల ఆధారంగా రైతులకు వివరించడం జరిగింది. వ్యవసాయ రంగంలో భాగంగా పన్యాల గ్రామంలో ఏ పంట ఎంత విస్తీర్ణంలో విత్తడం జరిగింది అలాగే రైతులకు ఉన్న వనరుల గురించి క్లుప్తంగా వివరరించారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ విస్తరణ అంశాలు ట్రాన్సాక్ట్ వాక్, చపాతీ పటం, సామాజిక పటం, వెన్ దయాగ్రం, సమస్యల చెట్టు, మొదలైన వాటిని విద్యార్థులు క్లుప్తంగా వివరించారు.కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి టి .రమేష్ , శ్రీకాంత్ ,గ్రామ రైతులు బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, అరుణ్ కాంత్ రెడ్డి, రవీందర్ , మల్లేశం, పోచయ్య, హన్మడ్లు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

### సిద్దివినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన చిన్నమైల్ అంజిరెడ్డి శుక్రవారం మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులోని స్వయంభూవు శ్రీ సిద్దివినాయక స్వామిని తన సతీమణి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరితో కలిపి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అంజిరెడి దంపతులను ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద మంత్రాలు వల్లిస్తుండగా అంజిరెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అంజిరెడ్డి దంపతులకు ఆశీర్వచనాలు చేసి తీర్ధ ప్రసాదాలు అందచేశారు. ఆలయానికి చేరుకున్న అంజిరెడ్డి దంపతులను మండల బిజెపి అధ్యక్షులు మల్లేష్ గంగ్వార్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గొల్ల భాస్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఓంకార్‌యాదవ్, యువ మోర్చా అధ్యక్షులు విష్ణుసునార్, నాయకులు శ్రీధర్‌రావు బడశేషి, నర్సింలు, వీరారెడ్డి, లక్ష్మారెడ్డి, రామ్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** రామచంద్రాపురంలోని తన నివాసంలో రంజాన్ మాస ఉపవాస దీక్ష సమయ వేళల క్యాలెండర్‌ను శుక్రవారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ మైనార్టీ అధ్యక్షులు అజీముద్దీన్, సర్కిల్ కార్యదర్శి గౌస్, విద్యుత్ నగర్ డైరెక్టర్ యూసుఫ్, మైనార్టీ నాయకులు జావిద్, అద్నాన్, బాబా, జాకీర్, షకీల్, మాటిన్, డివిజన్ అధ్యక్షులు బూన్, వార్డ్ సభ్యులు గిరి, నరేష్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

### స్వయం పాలన జరుపుకున్న విద్యార్థులు

**సిర్గాపూర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వాసర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. తమతో చదువుకుంటున్న విద్యార్థులకు ఉపాధ్యాయులైన విద్యార్థులు పాఠాలు భోదించారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల దేవి ప్రత్యేకంగా అభినందించారు. ఆర్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీ సోమేశ్వరాలయ వార్షికోత్సవాలు

**చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 28,ప్రభాతవార్త:**

చిన్నశంకరంపేట పట్టణంలోని శ్రీ సోమేశ్వరుడి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడవ రోజు గణపతి హోమం,రుద్రహోమం, రుద్రాభిషేకం, కుంకుమార్చన గ్రామ దేవతలకు బోనాల ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ తాజా మాజీ సర్పంచి రాజిరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు పాల్గొన్నారు.

### న్యాల్‌కల్ జడ్పీహెచ్ఎస్‌లో స్వయం పాలన

న్యాల్‌కల్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త: మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఆనందోత్సవాలతో స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషాధారణలో పాఠశాలకు చేరుకోవడంతో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అల్లాదుర్గం బాలికల పాఠశాలలో స్వయంపాలన

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా లాస్య, ఉపాధ్యాయులుగా శ్రీవ్య, మాధవి, అశ్విని, స్వాతి,, కౌసల్యలు బాధ్యతలు నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు బేబీలు పర్యవేక్షించారు. స్వయం పాలన దినోత్సవంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు.


Form No. IV
(See Sub-rule (2a) of Rule 5)
SUMMONS UNDER SUB-SECTION (4) OF SECTION 19 OF THE ACT, READ WITH SUB-RULE (2A) OF RULE 5 OF THE DEBTS RECOVERY TRIBUNAL (PROCEDURE) RULES, 1993
BEFORE DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD-II
1ST FLOOR, TRIVENI COMPLEX, HYDERABAD- 500001
Case No: O.A No. 631 OF 2024
M/s. ICICI Bank Ltd
Vs.
M/s. Pratibha Filling Station and Another

To,
1. M/s. Pratibha Filling Station Rajiv Rahadari, Sy No. 178/1, Pregnapur, Gajwel, Pregnapur Medak, Telangana- 502311.
2. Mrs. Pratibha Rao Tirukkovalluri ( P Mallu Pratibha) W/o. Not Known, Age: Major, Occ: Business R/o. Sy No. 178/1, Rajiv Rahadari Gajwel, Pregnapur, Gajwel, Pregnapur, Medak, Telangana, 502311 Nagar, Malkajgiri, Telangana- 500 047. ...Defendants

Whereas, OA No. 631/2024 was listed before Hon'ble Registrar on 13-02-2025. Whereas, this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs. 69,20,629.12ps (Rupees Sixty Nine Lakhs Twenty Thousand Six Hundred and Twenty Nine and Twelve Paisa Only)
In accordance with sub-section (4) of Section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Hon'ble Debts Recovery Tribunal -II, Hyderabad on 28-03-2025 at 10:30A.M. failing which the application shall be heard and decided in your absence.
Give under my hand and seal of the Tribunal on this the 20th day of Feb. 2025.

By Order of the Tribunal
Registrar
Debts Recovery Tribunal-II,
Hyderabad


### 2.5లక్షల ఎల్‌ఓసి అందచేత

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** కల్హేర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పి కిష్టయ్య అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న జహీరాబ్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకంలో 2 లక్షల 50వేల రూపాయలను మంజూరు చేయించగా శుక్రవారం ఎంపి సురేష్‌కుమార్ తనయ శివాని శెట్కార్ బాధిత కుటుంబ సభ్యులకు అందచేశారు. ఎల్‌ఓసి అందుకున్న కష్టయ్య కుటుంబ సభ్యులు ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### వన దుర్గమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**పాపన్నపేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

ఏడుపాయల వనదుర్గా భవాని మాతను శుక్రవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంతారెడ్డి తిరుపతిరెడ్డిలు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యేను ఆలయ ఈఓ చంద్రశేఖర్ ఆలయ మర్యాదలతోస్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలునిర్వహించారు. మహాజాతరలో భాగంగా చివరి ఘట్టమైన రథోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీజిల్లా రైతు సమన్వయ కమిటి చైర్మన్ సోములు, మాజీ పాలక మండలి చైర్మన్ బాలాగౌడ్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, కిష్టయ్య,నవీన్,సంజీవరెడ్డి,మల్లేశం,సాయిరెడ్డి ,శ్రీనివాస్, శ్రీనాథ్,బాపరావు పాల్గొన్నారు.

### శేల్గిర పాఠశాలలో ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

**మనూర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని శేల్గిర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన టిఎల్ఎం మేళా, ఫుడ్ ఫెస్టివల్‌ను మండల విద్యాధికారి శెట్కార్ రాజశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను ఎంఈఓ ఆసక్తిగా తిలకించి విద్యార్థులను అభినందించారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

### ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న శ్రీ చైతన్య,నారాయణ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లగిస్తూ ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నారని ఆ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ సంఘం నాయకులతో కలసి శనివారం రోజున జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే శ్రీచైతన్య,నారాయణ పాఠశాలలు పిఆర్‌వోలు,టీచర్లను వెంటపెట్టుకుని ముందస్తు అడ్మిషన్‌లకు ప్రచారాలు నిర్వహించడంతో పాటు విద్యార్థుల తల్లితండ్రులకుమాయమాటలు చెప్పి అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరో పించారు.ఈ విషయంలో విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం బాదా కరమైన విషయమన్నారు.ముఖ్యంగా ఈ పాఠశాల విద్యార్థులకు పాఠశాల యాజ మాన్యాలు స్పెషల్ క్లాస్‌ల పేరిట సెలవు దినాలలో సైతం పాఠశాలలు నడిపిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు.సిద్దిపేట జిల్లాలో కొన్ని ప్రాంతాలలో అనుమతులు లేకుండా పాఠశాలలు నడిపిస్తున్నారన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వేల్పుల ప్రసన్నకుమార్,జిల్లా నాయకులు అనిరుద్‌తో పాటు తదితరులు ఉన్నారు.



వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకుల దృశ్యం

## ఆకట్టుకున్న సైన్స్‌ఫేర్

### విద్యార్థుల ప్రతిభను కొనియాడిన ఎంఈఓ పాండు



లిటిల్‌స్కాలర్స్‌టెక్నో స్కూల్‌లో సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ పాండు

**ఆమనగల్లు,ఫిబ్రవరి 28,ప్రభాతవార్త:** భవిష్యత్తులో విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక రంగాలను బలోపేతం చేసేందుకు చిన్నప్పటి నుండే చదువుతోపాటు ఆయా రంగాల పట్ల విద్యార్థులకు అవగాహన, ప్రావిణ్యం కల్పించవలసినబాధ్యత విద్యాసంస్థలు, ఉపాధ్యాయులపై ఉందని ఆమనగల్లు మండల ఇంచార్జీ ఎంఈఓ పాండు అన్నారు. పాఠశాలలో నిర్వహించే సైన్స్ ఫేర్ కార్యక్రమాలతో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను, ప్రతిభ పాటవాలు వెలికి తీయడమే కాకుండా వారిని ఆయా రంగాల పట్ల ఆసక్తి పెంపొందించవచ్చని ఆయన అన్నారు. లిటిల్‌స్కాలర్స్ టెక్నో స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫేర్ కార్యక్రమానికి ఎంఈఓ పాండు ముఖ్య అతిథిగా హాజరైనారు. పాఠశాల చైర్మన్ చుక్కా అల్లాజీగౌడ్, అకాడమిక్ అడ్వయిజర్ జిల్లెల సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్లు చుక్కా సావిత్రిగౌడ్, జిల్లెల సుజాతరెడ్డిలతో కలిసి ఎంఈఓ పాండు రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన వస్తు ప్రదర్శనలను తిలకించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్ ప్రారంభోత్సవ సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో నిర్వహిస్తున్న విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కార్యక్రమాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతాయన్నారు. మధ్యాహ్నం స్థానిక భవాని ఫంక్షన్ హాలులో సాంస్కృతిక కార్యక్రమాలతో ముగింపు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెన్నయ్యగౌడ్, ఉపాధ్యాయ బృందం వెంకటేశ్వరశర్మ,నవ్య,శ్రీజన్య, యాదయ్య, శ్రీశైలం, హైమావతి,మమత, దీప్తి, మౌనిక, తేజ, ఉషారాణి, డాన్స్ మాస్టర్ ప్రభుశంకర్, ట్రస్మ ఆమనగల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్, ట్రస్మ ప్రతినిధులు నల్లబోలు సుధీర్‌రెడ్డి, అవ్వారి శివలింగం, గోలి శ్రీనివాస్, కోట్ల వెంకటేష్, ఆమనగంటి సంజీవ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

**పెద్దేముల్, పిబ్రవరి 28, ప్రభాతవార్త:** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని యంపిడిఓ జర్నప్ప అన్నారు. శుక్రవారంపెద్దేముల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో వారాంతపు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా యంపిడిఓ జర్నప్ప మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని అన్నారు. ఉపాధిహామి పథకంలో రోజువారి కూలీల సంఖ్యను పెంచుటకుకృషిచేయాలని అన్నారు. విధులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యంపిఓ రతన్‌సింగ్, ఏపిఓ నర్సిములు పాల్గొన్నారు.

## సివి రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న యంపిడిఓ జర్నప్ప

**పెద్దేముల్, పిబ్రవరి 28, ప్రభాతవార్త:** విద్యార్థులు సివి రామన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని యంపిడిఓ జర్నప్ప అన్నారు. శుక్రవారం పెద్దేముల్‌మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల (బాలుర) లో జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యంపిడిఓ జర్నప్ప,జిహెచ్‌ఎం సునిత మాట్లాడుతూ భౌతికశాస్త్రంలో భారతీయ శాస్త్రవేత్త సివి రామన్‌కు ప్రపంచ ప్రసిద్ద నోబెల్ పురస్కారం దక్కిందని అన్నారు. భారతదేశంలోజన్మించిన సివి రామన్ ప్రపంచ భౌతిక శాస్త్రవేత్తగా ఎదగడం దేశానికే గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ద్యావరి నరేందర్‌రెడ్డి, సంధ్యారాణి, శ్రీధర్, రామలింగేశ్వర్‌రావు, నజీర్ ఆహ్మద్, శంకర్, శిరిషాదేవి, అనురాధ, రాధ, రవికుమార్, యాదగిరి, మధుసుధన్, జయశ్రీ, అనిత, కవిత, ప్రతిభ, సవిత, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బిసిల సత్తా చాటాలి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 28** : రాబోయే స్థానిక ఎన్నికల్లో జనరల్ కోటాలో బీసీల సత్తా చాటాలని బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ముదిరాజ్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన బీసీసేన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, వాణిజ్యం, సేవా రంగం, వ్యాపారం, ఉద్యోగాలు ఇలా అన్ని రంగాల్లో తాము అంకిత భావంతో ఎదుగుతూ దేశానికి సహకారం అందిస్తున్నామని, కానీ రాజకీయంగా బీసీల ప్రాతినిథ్యం తక్కువగా ఉండడంపై తీవ్ర అసమతుల్యత ఉందని, ఈ అసమతుల్యతను తొలగించేందుకు ఈ స్థానిక ఎన్నికలు గొప్ప అవకాశమని అన్నారు. రాజకీయ పార్టీల వాగ్దానాలకు మోసపోకుండా వాస్తవానికి దగ్గరగా ఉన్న నాయకులను ఎంచుకోవాలని, బీసీలను ఓటు బ్యాంకుగా చూసే రోజులు పోయాయని, పాలనలో మనకు రావాల్సిన స్థానం, హక్కు, గౌరవం సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన నాయకులు కత్తి చంద్రశేఖరప్ప, భూషం నరేష్, చందులాల్, శివ ముదిరాజ్, తంగేడుపల్లి శంకర్, మల్కాపురం రవి, వరప్రసాద్, సురేందర్ గౌడ్, సాయిలు, మేకల వెంకటేష్, మార్గం భద్రప్ప, మడంపల్లి శివకుమార్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.3 లక్షల విలువ గల 2.8 కిలోల వెండి బహూకరణ

**షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 28** : ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలోని అంబా భవానీ మాత దేవాలయానికి మొగిలిగిద్ద గ్రామానికి చెందిన కక్కునూరి వెంకటేశం గుప్తా రూ.3 లక్షల విలువ చేసే 2.8 కిలోల వెండి ధారాపాత్ర మహాశివుడి అభిషేకం కోసం బహుకరించారు. ఈ పాత్రను భవానీ మాత ఆలయ చైర్మన్ ముత్యాల రాజుకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటరామిరెడ్డి, ఆంజనేయులు గౌడ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. వెంకటేశం గుప్తా కుటుంబ సభ్యులను గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలలో అకాడమిక్ సైన్స్ ఫేర్...

**శంకర్ పల్లి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** శంకర్ పల్లి నారాయణ పాఠశాలలో ఘనంగా అకాడమిక్ సైన్స్ ఫేర్ ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డిజిఎం వెంకటపల్లి కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ద్వారా పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుంది అన్నారు. అకాడమిక్ ఫేర్ లో పాల్గొన్న విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దివ్య, కోఆర్డినేటర్లు కనకరాజు, రాధిక, వనిత, డీన్ లు శ్రీకాంత్, కార్తీక్, వీపీలు సనావర్, భాగ్యలక్ష్మి ృ, ఏవో రాజేందర్ రెడ్డి, విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేతాజీ విద్య భవన్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

**కొడంగల్,ఫిబ్రవరి 28ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణంలోని శ్రీ నేతాజీ విద్య భవన్‌పాఠశాలలో నేషనల్ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్దులు,ఉపాధ్యాయులు,ప్రముఖ శాస్త్రవేత్త సివి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హజరైన అసిస్టెంట్ ప్రొఫెసర్ బాటనీ పాలమూరు యూనివర్సిటి డాక్టర్ పి.శివకుమార్ సింగ్ మాట్లాడుతూ నేటి బాలలే భారత దేశానికి కీలకం అని కొనియాడారు. విద్యార్దులు రూపొందించిన వైజ్ఞానిక నమూనాలను వీక్షించి,వాటి గురించి అడిగి తెలుసుకొని వారిని అభినందించారు. సివి.రామన్ దేశానికి అందించిన సేవలను,పరిశోధనలను గుర్తు చేశారు. ఈ సందర్బంగా తల్లిదండ్రులు,ఇతర వీక్షకులు పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాలడైరెక్టర్ అభిలాష్‌రెడ్డి,ప్రిన్సిరాల్ వంశీ, ఉపాధ్యాయులు,విద్యార్దులు ఉత్సహంగా పాల్గొనికార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అశేష జనవాహిని మధ్య ఘనంగా శివపార్వతుల కళ్యాణం

**మహేశ్వరం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ శివపార్వతుల కళ్యాణోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ, మాజీఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సతీమణీ విజయలక్ష్మి, మాజీ జడ్పి చైర్ పర్సన్ తీగల అనితా హరినాథ్ రెడ్డితోకలిసిపట్టు వస్త్రాలను అందజేశారు. దేవాలయంలో పంచా మృతాలతో అభిషేకం నిర్వహించి శివపార్వతుల ఊరేగింపునకు స్వాగతం పలికారు. మహేశ్వరం గ్రామ ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వేలసంఖ్యలో భక్తులు పాల్గొని శివ పార్వతుల కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం దేవాలయం ప్రాంగణం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరింప చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అల్లె కుమార్ ముదిరాజ్, కాకి ఈశ్వర్ ముదిరాజ్,రఘుపతి, బంగారుగల్ల లాజర్, సుబాష్, శంకర్, నంది గామ నరసింహ, హరికృష్ణ, సుధీర్, కాకి కుమార్, ఈవో మురళీ కృష్ణ, ట్రస్ట్ సభ్యులు బాలమణి, ఏకలవ్య, కర్ణ తదితరులు పాల్గొన్నారు.



శివపార్వతుల కళ్యాణంలో పాల్గొన్న భక్తులు.

## శ్రీ రామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం,వసంతోత్సవం

**కీసర, ఫిబ్రవరి28,ప్రభాతవార్త:** కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వరస్వామి మహ శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు శుక్రవారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. తెల్లవారు ఝూము నుండే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనిస్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రాజ గోపురానికి ఎదురుగా ఉన్న శివ లింగాలకు అభిషేకాలు, పూజలు చేశారు. మహ శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రుద్ర స్వాహకారహోమాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామివారికి మహన్యాస రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు (మహమండపంలో)అన్నాభిషేకం,ప్రదోష కాలపూజ,హరతి, మంత్రపుష్పం,



గర్భగుడిలో శివలింగానికి అన్నాభిషేకం



లింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

వసంతోత్సవం, పుష్పయాగం తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. టిటిడి వేద పాఠశాల ఆగమశాస్త్రి పండితులుగణపతి శర్మ పర్యవేక్షణలో హోమం కార్యక్రమాలను నిర్వ హిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు నల్ల మధు సూధన్‌రెడ్డి, పోచబోయిన రాజు, ొండబోయిన ప్రవీణ్‌కుమార్, మొరుగు ముత్యాలు, దుండిగల దుర్గా ప్రసాద్‌గౌడ్, సామల అమరేందర్, నల్లోల కుమార్, కందాడి రాజిరెడ్డి, జూపల్లి సాయిలు తదితరులు పాలొన్నారు

## మాజీ వీఆర్వో భీమిరెడ్డి పార్థీవ దేహానికి నివాళులు

### కమిటీ చైర్ పర్సన్ దంపతులను పరామర్శించిన ఎమ్మెల్యే



భీమిరెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 28:** షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి ఇంట విషాదం నెలకొనడంతో శుక్రవారం కొందుర్గు మండలం ఆగిర్యాల గ్రామంలో కృష్ణారెడ్డి తండ్రి భీమిరెడ్డి పార్థివ దేహానికి ఘనంగా నివాళులర్పించారు. వీఆర్వోగా ఎన్నో సేవలు అందించి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న భీమిరెడ్డి ఆత్మ శాంతించాలని ఎమ్మెల్యే అన్నారు. కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శంకర్ ధైర్యం చెప్పారు. కృష్ణారెడ్డి కుటుంబానికి ఇదితీరని లోటని ఎమ్మెల్యే శంకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, రఘు నాయక్, పురుషోత్తం రెడ్డి, కర్ణాకర్, జితేందర్ రెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, కుమార్ గౌడ్, రామ్‌రెడ్డి, కేశంపేట మండల పార్టీ అధ్యక్షుడు వీరేశం, మహబూబ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కృష్ణారెడ్డిని పరామర్శించిన జర్నలిస్టులు**

కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తండ్రి భీమిరెడ్డి మృతిపట్ల పలువురు సానుభూమి తెలిపారు. ఆగిర్యాల గ్రామానికి చెందిన భీమిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం సీనియర్ జర్నలిస్టు కేపీ, రాఘవేందర్ గౌడ్, మధురాపురం మాజీ ఎంపీటీసీ భార్గవ్ కుమార్ రెడ్డిలు కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భీమిరెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి కొందుర్గు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తండ్రి భీమిరెడ్డి పార్థివ దేహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, గడ్డమీది రాజు, కిసాన్ మోర్చా జిల్లా నాయకుడు శివారెడ్డి, బోయ అశోక్, రాజు, వెంకటేష్, రాజేష్ నివాళులర్పించారు.

## శంకర్‌పల్లిలో ఘనంగా టైలర్స్ డే వేడుకలు

**శంకర్‌పల్లి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** శంకర్‌పల్లి మండల కేంద్రంలో టైలర్స్ డే వేడుకలను టైలరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం కోటి శివకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్ వార్డులో గల కాళికామాత ఆలయంలో టైలరింగ్ సభ్యులంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన చౌరస్తాలో బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 28న ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రపంచ వ్యాప్తంగా టైలర్స్ డే ను జరుపుకుంటారని, టైలరింగ్ చేస్తూ సమాజంలో ఆత్మ గౌరవంతో మన కాళ్లపై మనం నిలబడాలన్నారు.

ఎంతోమంది నిరుద్యోగులకు, గృహిణులకు ఉపాధి కల్పించే వృత్తి టైలరింగ్ అన్నారు. కుటుంబ పోషణలో మనవంతుగా చేయూతనందిస్తూ, కుటుంబానికి ఆసరాగా నిలుస్తూ, టైలరింగ్ చేసే ప్రతి ఒక్కరు వృత్తి పరంగా మరింత అభివృద్ధి చెందే విదంగా ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందాలని కోరారు. ఈ సందర్భంగా మండల, మున్సిపల్ టైలరింగ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు జగన్, శివకుమార్, సతీష్, దేవరాజ్, యాదయ్య, బిక్షపతి, రాజు, శ్రీనివాస్, ప్రభు, వెంకట్రావు, మహేష్ కుమార్, రమేష్ కుమార్, సురేష్ కుమార్, పద్మయ్య, రాములు, రవి, ఆరిఫ్, సాదత్, టవర్ సతీష్, శంకర్, శ్రీను, ప్రసాద్, శ్రీరామ్, మదన్ ఉన్నారు.

## పాఠశాలలో అకడమిక్ సైన్స్ ఫెయిర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 28** : పట్టణంలోని నారాయణ పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం అకాడమిక్ సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సైంటిస్ట్ డాక్టర్ కీర్తి వల్లభనేని, ఎంఈవో మనోహర్‌లు పాల్గొన్నారు. సైన్స్ ఫెయిర్‌లో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు (తెలుగు వైభవం), హిందీ (శిక్షా సాగర్), ఇంగ్లీష్ (ఇంగ్లీష్ కాస్టుల్), మ్యాథ్స్ (రాకెట్ రామానుజన్), ఫిజిక్స్(న్యూటన్ ప్లే గ్రౌండ్), కెమిస్ట్రీ (కెమిస్ట్రీ కాస్మోస్), బయాలజీ (బయో బ్లేజ్), సోషల్ (కమ్యూనిటీ కాన్వాస్) అనే పేర్లతో విద్యార్థులు తాము ఎంచుకున్న సబ్జెక్టులకు సంబంధించి ప్రాజెక్టుల నమూనాలను తయారు చేసి తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రేక్షకులకు చక్కగా వివరించారు. వరి పండించే విధానం, రామ మందిరము, పండగలు, గుండె నమూనా, ఊపిరితిత్తుల నమూనా, బ్యాంకింగ్ సిస్టం, చంద్రయాన్ 3, పైథాగరస్ తీరం, ఎలక్ట్రిక్ కండక్టివిటీ తదితర అంశాలపై విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైంటిస్ట్ డాక్టర్ కీర్తి వల్లభనేని, ఫరూఖ్‌నగర్ ఎంఈవో మనోహర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులలోని ప్రతిభను గురించి వారిని ప్రోత్సహిస్తే నేటి బాలలే రేపటి భావి భారత పౌరులుగా దేశ అభ్యున్నతికి తోడ్పడేట్లుగా అభివృద్ధి చెందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలోఏజీఎం వెంకట్‌రెడ్డి, అనిల్ కుమార్, స్వాతి,లక్ష్మీ, సంగీత, మాధవి, నితిన్ కుమార్ రెడ్డి, రీనా గుప్తా, మాధురి, ఏవో శ్రీధర్,ఏడీనేత్ర, వైస్‌ప్రిన్సిపల్ సంధ్యారాణి,అనసూయ, పాల్గొన్నారు.

## సిబ్బంది విజ్ఞాన శాస్త్రమే అభివృద్ధికి మూలం

**చౌడాపూర్ ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోగల మందిపాల్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి సైన్స్‌ఫేను నిర్వ హించారు..విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో విజ్ఞాన శాస్త్రంపై అవ గాహన కల్పించారు.మండల విద్యాధికారి రామచందర్ పాల్గొని, ప్రదర్శనలను తిలకించి, విద్యార్థులను అభినందించారు..అమ్మ పాఠశాల చైర్మన్ యాదమ్మ,శివలీల,ఉపాధ్యాయులు మురళీధర్,యాదయ్య, శ్రీనివాస్ ,జహీర్,రాందాస్,విజయ,శ్రవణ్‌అనిల్,విద్యార్థులు పాల్గొన్నారు.

## సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి



**షాబాద్,ఫిబ్రవరి28, ప్రభాతవార్త:** విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు అనురాధ అన్నారు. మన్మర్రి ప్రాథమిక పాఠశాలలోజాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.సామాన్యశాస్త్ర ప్రగతి కోసం సర్ సివి రామన్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేసుకొని లక్ష ్యసాధన కోసం కృషి చేయాలన్నారు. విద్యార్థు లకు శాస్త్రసాంకేతికత పట్ల అవగాహన కలిగించుటకు మానవ శరీరంలో ఊపిరితిత్తులు పనిచేసే విధానం,పవన విద్యుత్ వర్కింగ్ మోడల్ ,ఆక్సిజన్ సహాయంతో కొవ్వొత్తులు వెలిగేవిధానం,గాలి పీడనాన్నికలిగి ఉంటుందనే విశయాన్ని ప్రయోగాలతో చూయించి, వర్షపాతాన్ని సెంటీమీటర్లలో కొలిచే విధానం,మ్యాజిక్ చేసి చేతి వేళ్లను విరిచి అతికించే విధానం తదితర విజ్ఞాన కార్యక్రమాలను

## నీటి వృధాను సమూలంగా అరికట్టాలి

### ప్రతి నీటిచుక్కను లెక్క కట్టాలి

### సెవ్ వాటర్, సెవ్ లైఫ్స్, వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ

### నీటి సమస్యను పరిష్కరిస్తున్న వాటర్‌హెడ్ అధికారులు

**మొయినాబాద్, ఫిబ్రవరి 28,ప్రభాతవార్త :** నీటి వృదానుఎక్కడికక్కడ అరికట్టాలని, ప్రతి నీటి చుక్కను లెక్కకట్టాలని, సెవ్‌వాటర్, సెవ్ లైఫ్స్ అంటు గ్రామాల్లో ప్రజలకు నీటి అవస్రతను, నీటి పోదుపు పై అవగాహన కలిగిస్తున్న వాటర్ అయిడ్ ఇండియా సంస్థ, మొయినాబాద్ మండలలోని రెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం వాటర్ ఎయిడ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెడ్డిపల్లి గ్రామా పాఠశాల విద్యార్థులతోగ్రామంలో ర్యాలీ నిర్వహించి, గ్రామంలోనీటివాడకంపై గ్రామస్తులకు ప్రత్యేకంగా అవగాహన సదస్సును ఏర్పాటుచేసి వారికి వాటర్‌యొక్క ప్రాముఖ్యత గూర్చి వివరించడం జరిగిందని, వాటర్ అయిడ్ ఇండియా సంస్థ మొయినాబాద్ మండల ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వాహేద్ తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు, గ్రామాల్లో బోర్లు, వేసుకొని ఇండ్లు నిర్మించుకున్న వారైనా, ఎవరైనా నీటిని వృదాకాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు విధిగా పాటించాలని కోరారు, ఒక్క నీటి బోట్టును కాపడడమంటే ఎంతో నీటిని సృష్టించినట్లేనని, చేతులు, కడిగేటప్పుడు, బట్టలు ఉతికేటప్పుడు, పంపు సెట్లవద్ద, నీరు పడుతున్నప్పుడు, బోరు మోటర్‌ను స్టార్ట్ చేసి మన పనులు అయేంత వరకు నీటిని వృదాగా వదిలేస్తుంటారు, దయచేసి అలాంటివి చేయకూడదని కోరారు, భారత దేశంలో చుట్టు నీరు వున్నా, నేటికి గ్రామాల్లో కూడ వాటర్ ట్యాంకర్ల అవస్రత వచ్చిందంటే ఇంకా కొన్ని రోజులు అయితే భూగర్భజలాలు అడింగింటి కనీసం తాగడానికి నీరు దొరకని దుస్థితి వస్తుందని, నేటికి దేశంలో ఎన్నో గ్రామాలు త్రాగు నీరు లేక కిలోమీటర్లు నడిచి ఒక్క బిందదు నీరు కోసం ఎన్నో కిలోమీటర్లుప్రాయాణించాల్సిన పరిస్దితి ఉందని, అలాంటి పరిస్దితులు మనకు తల్లేత్తకముందే జాగ్రత వహించాలని కోరారు, నీరు లేక భూమిపై ఎన్నో జీవరాసులు మరణిస్తున్నాయని, ఎంతో మందిమనుషులునీరు దొరకక మరణిస్తున్నారని, మన వద్ద నీరు వుందని వృదా చేయకూడదని కోరారు, నీటి వృదాను అరికట్టి,సెవ్ వాటర్, సెవ్ లైఫ్స్ అనే నినాదం విద్యార్దులు వారి ఇంట్లో తల్లి,దండ్రులకు తెలియజేయాలని అన్నారు, మొయినాబాద్ మండలంలోని ఏ గ్రామాల్లో నైనా నీటి సమస్య ఉంటే వాటి పరిష్కరించడానికి మా వంతు బాధ్యతగా పైప్ లైన్లను వేయించడం, బోరు భావి వుండి, అందులో నీరు వుంటే వాటిలో వాటార్ అయిడ్ ఇండియా సంస్ద తరుపున ఉచ్చితంగా బోరుమోటర్లు దించి అక్కడి ప్రజలకు నీరు అందేలా చర్యలు తీసుకుంటునే, వారికి నీటి వాడకం పై అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరు నీటిని కాపాడే బాధ్యత తీసుకోవాలని కోరారు, రానున్న వేసివి కాలంలో నీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు, ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి గ్రామ కార్యాదర్శి రంజిత్, పాఠశాల ప్రధానో పద్యాయులు పూర్ణ చక్రధరరావు, వాటర్ ఎయిడ్ ఇండియా, ప్రతినిధి వాహెద్, పాఠశాల సిబ్బంది, అబ్దుల్ మూజీబ్, కె. నారాయణ, సుధాకర్, పాల్గొన్నారు,

## సంకల్ప బలంతో లక్ష్యాలను సాధించవచ్చు



విద్యార్థులకు పరీక్ష వస్తు పరికరాలను అందజేసిన సదర్ శ్రీను తదితరులు

**నందిగామ ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** విద్యార్థులు మంచి క్రమశిక్షణ కలిగి ఉండి దృఢ సంకల్పం, పట్టుదలతో చదివితే విజయాలు మన సొంతమవుతాయని నందిగామ సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కేశమోని శ్రీనివాస్ సూచించారు . శుక్రవారం నందిగామ మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ వస్తు పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చెడు వ్యసనాలకు, స్మార్ట్ ఫోన్ లకు అలవాటై తమ బంగారు భవిష్యత్తును చేచేతుల నాశనం చేసుకోవద్దు అన్నారు. పదవ తరగతి పరీక్షల్లో టెన్ బై టెన్ జిపిఎస్ సాధించి ప్రథమ స్థాయిలో వచ్చిన విద్యార్థులకు రూ.15వేలు, ద్వితీయ స్థాయిలో వచ్చిన వారికి రూ.10 వేలు, తృతీయ స్థాయిలో వచ్చిన వారికి రూ.5 వేలు చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. విద్యార్థి దశ నుండే ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్, మారుతి, దినేష్, ఎరుకల నరేష్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా టైలర్స్ డే

**ఆమనగల్లు, ఫిబ్రవరి28,ప్రభాతవార్త:** ఆమనగల్లు మండల కేంద్రంలో శుక్రవారం టైలర్స్‌డేను పట్టణ టైలర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ పుట్టినరోజును పురస్కరించుకుని దర్జీలు టైలర్స్ డేను జరుపుకుంటున్నారు. కాగా పట్టణంలో జరిగిన టైలర్స్‌డే పురస్కరించుకుని విలియమ్స్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకుని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సేవా కార్యక్రమాన్ని చేపట్టి పండ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము ముఖ్యఅతిథిగా హాజరైనారు. కార్యక్రమంలో చాత సాయిబాబా, పున్న శ్రీను, కృష్ణయ్య, యాదగిరి, బిక్షపతి, యాదగిరి ,నరసింహ, కృష్ణ, మహేష్, గంజి శ్రీను,శంకర్, నాగరాజు, గంజి నర్సింహ్మా. లక్కీ యాదగిరి, వస్పుల నర్సింహ్మా, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## శివయ్య పూజల్లో మాజీ ఎంపిపి ఎం శివ శంకర్ గౌడ్

**నందిగామఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** శివుడు అభిషేక ప్రియుడు కాబట్టి కేవలం భక్తితో అభిషేకం చేస్తే చాలు తృప్తి చెంది, ఆ పరమేశ్వరుడు మనలను అనుగ్రహిస్తాడని ఉమ్మడి మండలాల మాజీ ఎం శివశంకర్ గౌడ్ అన్నారు. మహాశివరాత్రి పర్వదినన సందర్భంగా శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి వెంకమ్మగూడ శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అందరూ సుఖసంతోషాలతో.. ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించమని త్రినేత్రుని వేడుకున్నారు. ఈ పూజలో మంచన్ పల్లి రాములు గౌడ్, లక్ష్మమ్మ, ఏం రాజు గౌడ్, మాజీ ఎంపీపీ ఎం ప్రియాంక శివ శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గిర్మాపూర్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

**మేడ్చల్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** మేడ్చల్ మున్సిపల్ పరిధి గిర్మాపూర్ గ్రామంలోనిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలతో పాటు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ సైన్స్ అనేది మానవ జీవితంలో విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉంటుందని, విజ్ఞానంతోనే అజ్ఞానం, మూఢనమ్మకాలు తొలగిపోతాయని వివరించారు. మానవ అభివృద్ధి సైన్స్ తోనే ముడిపడి ఉందని, శాస్త్రవేత్తలు చేసిన ఆవిష్కరణలతోనే నేడు ప్రపంచం మనుగడ సాధిస్తున్నదని తెలిపారు. చిన్ననాటి నుండే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, సత్యనారాయణ, శివకుమార్, వాణి, మంజుల, జనార్ధన్, చరిత, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

## నారేగూడలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

**నవాబుపేట ఫిబ్రవరి 28,ప్రభాతవార్త :** మండల పరిధిలోని నారేగూడలో శుక్రవారం శ్రీభవానిరామలింగేశ్వర బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి రిటైర్డ్ ప్రొఫెసర్ పర్వేద మానిక్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు అంగరంగా వైభవంగా సాగాయి. వేదపండితుల మంత్రోత్సరణ మధ్య స్వామివారి కళ్యాణం కమనీయంగా జరిగింది. పట్టువస్త్రాలను పీఠాధిపతి దంపతులు లలితమానిక్‌రావు సమర్పించారు. అశేష భక్తజన సందోహం మధ్య కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాలైన గంగ్యాడ, పూలపల్లి, తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను ఆస్వాదించారు. మహిళలు బతుకమ్మను ఆడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ రాష్ట్ర సంయుక్త అధికారు అమృతరావు, మాజీ సర్పంచ్‌లు. నాయకులు, ఆయా గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**కడ్తాల్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** కాలుష్య రహిత సమాజ శ్రేయస్సు కొరకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి హైదరాబాద్ శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై దశరథ్ నాయక్, ఆనంద్ మొక్కలు నాటారు. అనంతరం డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా జన్మదినం సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గంప శ్రీను జోగు వీరయ్య రామకృష్ణ హరి చందు నాయక్ పాండు నాయక్ అంజి కృష్ణ శ్రీకాంత్, ఇర్షద్, తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ పట్ల ఆసక్తి పెరిగేలా బోధించండి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈవో గాయత్రి దేవి

**కొందుర్గు, ప్రభాతవార్త, ఫిబ్రవరి 28 :** సైన్స్ పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా విద్యా బోధన చేయాలని మండల ఎంఈవో గాయత్రి దేవి ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా మాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు చేస్తున్న విద్యా బోధన పట్ల బాగా చదివి డాక్టర్లుగా,ఇంజనీర్లుగా, శాస్త్రవేత్తలుగా తయారు కావాలని ఆమె విద్యార్థులను కోరారు. . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నిస్సి, తాజా మాజీ సర్పంచ్ షరీఫ్ జహంగీర్, సామాజిక కార్యకర్త కందుకముల సుధాకర్ గౌడ్, ఉపాధ్యాయ బృందం సునీత, అనురాధ, ఉమాదేవి, రజిత, పల్లవి, శారద, కల్పన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా అడవి మైసమ్మ జాతర ఉత్సవాలు

**కొడంగల్‌రూరల్,ఫిబ్రవరి28ప్రభాతవార్త:** మండల పరిధిలోని మైసమ్మ తండా,ఖాజాఅహ్మద్‌పల్లి గ్రామాల సమీపంలోని అడవిలో వెలసిన అడవి మైసమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి.జాతర ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శుక్రవారం అడవుల మైసమ్మ తల్లికి చిట్లపల్లి, ఖాజాఅహ్మద్‌పల్లి,పోచమ్మతండా,మైసమ్మ తండాకు చెందిన మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.కోడిపుంజు కల్లు సీసాలతో పూజలు చేస్తు పిల్లాపాలను చల్లంగా చూడాలని మహిళలు బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.డప్పు చప్పుళ్ళు,శివసత్తు పూనకాల మధ్య ఆలయానికి చేరుకొని నైవేద్యాలను సమర్పించారు